## నిర్మల్ సబ్ డివిజన్ అధికారిగా రాజేశ్ మీనా



ఎస్పీని కలిసిన రాజేశ్ మీనా

నిర్మల్ అర్బన్, జనవరి 1 : నిర్మల్ సబ్ డివిజన్ అధికారిగా రాజేశ్ మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డాక్టర్ జానకీషర్మిలను మర్యాద పూర్వకంగా కలిశారు. నిర్మల్ సబ్ డివిజన్ సమస్యలపై చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పాటు పడాలని ఆయనకు తెలిపారు.

## బీఎస్ఎన్ఎల్ టవర్ పనులు ప్రారంభించాలి

బోథ్, జనవరి 1 : మండలంలోని అజ్జర్–వజ్జర్ పరిధి లోని కేశవ్‌గూడ గ్రామంలో నిర్మిస్తున్న బీఎస్ఎన్ఎల్ టవర్ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు బుధవారం ఆదిలాబాద్‌లోని కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. టవర్ పనులు పూర్తి చేసి మారుమూల ఆదివాసీ గ్రామాలకు సిగ్నల్స్ అందేవిధంగా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఎంసీ డైరెక్టర్ ఇస్రు పటేల్, గ్రామస్తులు చెట్లపెల్లి అనిల్, బత్తుల రమేశ్, విజయ్ భాస్కర్ రెడ్డి, పోతన్న ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

దస్తురాబాద్, జనవరి 1 : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. అలాగే వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేశారు. మద్యం తాగి పట్టుబడిన ఆరుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## మతిస్థిమితం లేని వృద్ధురాలి మృతి



భూతి రాజుబాయి(ఫైల్)

ఇచ్చోడ, జనవరి 1: మతిస్థిమితం లేని వృద్ధురాలు ఆకలి, దప్పికతో మృతి చెందిన ఘటన ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని భూతి రాజుబాయి(75) డిసెంబర్ 30న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించిన ఆచూకీ లాభ్యం కాలేదు. డిసెంబర్ 31న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నెల 1వ తేదీన చహకటి ఈశ్వర్ పత్తి చేనులో విఘాత జీవిగా కనిపించింది. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా రాజుబాయి ఆకలి, దప్పికతో సోమసిల్లి పడి ప్రమాదవశాత్తు చనిపోయినట్లు ఉంది. నేర స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

EDUCATION

★ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337305

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

# మూడుముళ్లు.. బాల్యానికి సంకెళ్లు

- చదువుకోవాల్సిన వయస్సులో పెళ్లిపీటలెక్కుతున్న బాలికలు
- ఇప్పటికైనా తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



బజార్‌హత్నూర్ మండలంలో బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు(ఫైల్)





బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్

ఎదులాపురం, జనవరి 1 : పుస్తకాలు పట్టాల్సిన చిట్టి తల్లులు బాల్యంలోనే పెళ్లి పీటలెక్కుతున్నారు. తెలిసి తెలియని వయస్సులో ఆ పసిపాపలపై సంసార బాధ్యతలు గుదిబండలా మారుతున్నాయి. పేదరికం ఒక వైపు.. ఆడపిల్ల భారం తీరుతుందని కన్నోళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడో ఓ మూలన బాల్య వివాహాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది 14 బాల్యవివాహాలను అధికారులు అడుకున్నారు. డిసెంబర్ 12వ తేదీ 2024న బజార్‌హత్నూర్‌లో బాల్యవివాహాన్ని చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, ఐసీడీఎస్, పోలీస్ అధికారులు కలిసి అడ్డుకున్న విషయం తెలిసిందే.

### బాల్య వివాహం నేరం

బాల్య వివాహాలను అరికట్టేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయి. బాల్యవివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంటుంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు పూర్తయ్యే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

### బాల్య వివాహాలతో అనర్థాలెన్నో..

బాలికలకు వివాహం చేస్తే రక్తహీనత సమస్య ఏర్పడుతుంది. శారీరక సమస్యల బారిన పడుతున్నారు. దీంతో పాటు మాతృమరణాలు, శిశు మరణాలు సంభవిస్తున్నాయి. నెలలు నిండకనే బిడ్డ పుట్టడం, బరువు తక్కువగా ఉండడం, ఎత్తుతగ్గ బరువు లేకపోవడం శారీరక లోపాలు ఇతరాత్ర కారణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

### ఎవరికి ఫిర్యాదు చేయాలి..?

బాల్యవివాహం జరుగబోతుందని, జరుగుతుందని కచ్చితమైన సమాచారం ఉంటే ఎవరైనా 1098కు, డయల్ 100కు సమాచారం ఇవ్వవచ్చు. వీటి ఆధారంగా కౌన్సెలింగ్ లేదా సమోటోగా కేసు నమోదు కూడా చేయవచ్చు. ఐసీడీఎస్ అధికారులకు బాల్యవివాహాలను అడ్డుకునే హక్కులున్నాయి. వధువు, వరుడు తమకు పెళ్లి ఇష్టం లేదని అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే పెళ్లి నిలిపివేస్తారు. ఒక వేళ పెళ్లి జరిగినా చట్టప్రకారం చెల్లుబాటు కాదు.

### అడ్డుకునే అధికారులు వీరే..

జిల్లా కలెక్టర్ : పూర్తిస్థాయి జిల్లా బాధ్యతలు, డివిజన్‌లో : సబ్‌కలెక్టర్లు, ఆర్డీవో, మండల స్థాయిలో : తహసీల్దార్లు, ప్రాజెక్టు స్థాయిలో : సీడీపీవోలు, ఏసీడీపీవోలు, గ్రామాల్లో : ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉంటారు.

### బాల్యవివాహ రహిత దేశం కోసం కృషి చేయాలి



బాల్య వివాహ రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి. ఎక్కడైన బాల్యవివాహాలు జరిగిన, జరుగుతున్న, జరగబోయే సమాచారం ఉన్న 1098, 100 నంబర్లకు సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు చాలా గొప్యంగా ఉంచడం జరుగుతుంది. బాల్యావివాహాల నిర్మూలనకు వివిధ స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయి.

-రాజేంద్రప్రసాద్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఆదిలాబాద్

### అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నాం..



చదువుకునే వయస్సులో బాల్యవివాహలు చేయడం చట్టరీత్యానేరం. ఇందు కోసం స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. పాఠశాలు, కళాశాలలు, గురుకులల్లో అవగాహన కల్పిడంతో పాటు వాటితో జరిగే అనార్థాలు వివరిస్తున్నాం.18 సంవత్సరాల లోపు అమ్మయి, 21 సంవత్సరాల లోపు అబ్బాయికి వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలు, రూ.లక్ష జరిమానా కోర్టు విధిచే అవకాశం ఉంది. ఎక్కడైన బాల్యవివాహలు జరిగే టోల్ ఫ్రీ నంబర్ 1800 1027 222 లేదా 1098కి సమచారం ఇవ్వాలి.

-గోపాల్ రెడ్డి, షుర్ ఎన్జీవో అధ్యక్షుడు

## దుప్పట్లు పంపిణీ



తాంసి: దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

తాంసి, జనవరి 1: గోట్కూరి గ్రామంలో శ్రీ షిర్డీ సాయి సేవా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ సాయి వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ చలికాలం దృష్టిలో పెట్టుకొని దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తోట శివన్న, మేనేజర్ పసుపుల రాజు, ఆకుల సునీల్, భగవాన్లు, రవికాంత్, అశోక్, రోహిత్ పాల్గొన్నారు.

భైంసాటౌన్, జనవరి 1: వానల్‌పాడ్ శివారులోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు బుధవారం సత్యసాయి బాబా యువజన సేవా సమితి విభాగం సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భీంసేన్, సూరి బాబు, శ్రీనివాసరాజు, శ్రీనివాస్, సాయినాథ్ యాదవ్, భగవాన్ పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

నర్సాపూర్ (జీ), జనవరి 1 : నర్సాపూర్(జీ) మండలం చాక్‌పెల్లి గ్రామంలో శేషులు హిమ్మత్ రావు పటేల్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేతగా నిలిచిన జట్లకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ అన్ని విధాల అవసరాలను సమకూర్చిన మోతిలాల్ పటేల్‌ను మేనేజ్‌మెంట్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సయ్యద్ ఖలీం, వెంకట్ నర్సింహ రెడ్డి, డాక్టర్ భోజన్న, సయ్యద్ ఆజం, ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యుడు సయ్యద్ షఫీ, మేనేజ్‌మెంట్ సభ్యులు సయ్యద్ ఫిర్దోస్, తాహిర్ ఫహీం అమీర్, జమీల్ షా పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జాన్సన్ నాయక్



ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో జాన్సన్ నాయక్

ఖానాపూర్, జనవరి 1: ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు బుధవారం బీఆర్ఎస్ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో పలు మండలాల పార్టీ శ్రేణులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పారు. కొత్త సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని జాన్సన్ నాయక్ ఆకాంక్షిచారు. ఇక్కడ పట్టణ అధ్యక్షుడు గౌరికర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

పెంబి, జనవరి 1: మండల కేంద్రంలో పాముకాటుకు గురైన వరప్రసాద్, అనారోగ్యంతో బాధపడుతున్న గోదురి భూమన్న కుటుంబాలను బుధవారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి, నాయకులు భూక్యా గోవింద్, బైరెడ్డి గంగారెడ్డి, గాండ్ల శంకర్, సుతారి మహేందర్, సోన్న రాజేందర్, మల్లేశ్ ఉన్నారు.

## ఘనంగా భీమా కోరేగావ్ శౌర్య దివస్



ఇంద్రవెల్లి: సామూహికంగా వందన తీసుకుంటున్న బౌద్ధ ఉపాసకులు, నాయకులు



నార్నూర్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉట్నూర్, జనవరి 1: ఉట్నూర్‌లోని అంబేద్కర్ చౌక్‌లో భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్, ఉపాధ్యక్షుడు భరత్, ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞాశీల్ మాట్లాడుతూ మహారాష్ట్రలోని పూణే ప్రాంతంలో సమానత్వం కోసం, మానవ హక్కుల కోసం భీమా కోరేగావ్‌లో పీష్వా సైన్యానికి వ్యతిరేకంగా మహర్ సైనికులు చేసిన యుద్ధం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. అనంతరం వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుశీల్, రమేశ్, గంగేశ్, అరవింద్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జనవరి 1: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ, భీం ఆర్మీ, దళిత సంఘల నాయకులు ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా పార్టీల నాయకులు, దళిత బౌద్ధ ఉపాసకులు, ఆదివాసీ సంఘాల నాయకులు మహర్ వీర సైనికుల అమరవీరుల స్తూపంతో పాటు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళితుల బౌద్ధ ఉపాసకుల ఆధ్వర్యంలో పంచశీల్, త్రిషరణ్, బుద్ధవందన, ధమ్మవందన, సంఘవందన తీసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్ డోంగ్రే, మాజీ ఎంపీపీ కనక తుకారాం, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధానకార్యదర్శి వాగ్మారే కామ్‌రాజ్, ఉపాధ్యక్షుడు శివాజీ పవార్, కోశాధికారి సునీల్, ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సంఘం మాజీ అధ్యక్షుడు ఆర్కా ఖమ్ము, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దిలీప్‌మోరే, లంబాడా సంఘం నాయకులు రాథోడ్ అనిల్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, దళిత బౌద్ధ ఉపసకులు ఉత్తమ్ కాంబ్లే, సావంత్ లహుదాస్, మస్కే రాజ్‌వర్ధన్, సర్కేళే శివాజీ, దత్తా పరత్వాగ్, సూర్యవంశీ ఉత్తమ్, దత్తా ఆచారే, అతీశ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్, జనవరి 1 : మండ కేంద్రంలోని త్రిరత్న బుద్ధవిహార్‌లో భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను దళిత, గిరిజన సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, మాజీ జడ్పీటీసీ హేమలత బ్రిజ్జిలాల్, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు లోకండే చంద్రశేఖర్, విద్యావేత్త బాలాజీకాంబ్లే, సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావ్, బహుజన జాగృతి సేన మండలాధ్యక్షుడు జాడే నాందేవ్, నాయకులు లోకండే దేవ్‌రావ్, చాలుర్కర్ ప్రకాశ్, విఠల్, దయానంద్, అంబేద్కర్ యూత్, బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని హమాలీల సమ్మె



సారంగాపూర్: సమ్మె చేస్తున్న హమాలీలు



జైనథ్: నిరవధిక సమ్మెలో పాల్గొన్న హమాలీలు

సారంగాపూర్, జనవరి 1: మండలంలోని చించోలి(బీ) సివిల్ సప్లయ్ గిడ్డంగి వద్ద బుధవారం హమాలీలు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా హమాలీల సంఘం అధ్యక్షుడు పుండలిక్ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ గోదాముల్లో పని చేస్తున్న హమాలీల క్వింటాల్ బియ్యం బస్తాకు ప్రభుత్వం 29 రూపాయాలకు పెంచుతామని చెప్పి ఇంత వరకు పెంచడం లేదన్నారు. గతంలో ప్రభుత్వం హమీ ఇచ్చి ఇప్పటి వరకు పెంచకపోవడంతోనే హమాలీలు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, హమాలీల బోనస్, ఇతరాత్ర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హమాలీల సంఘం ఉపాధ్యక్షుడు సాయన్న, హమాలీలు పాల్గొన్నారు.

జైనథ్, జనవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం సివిల్ సప్లయ్ హమాలీల డిమాండ్లు నెరవేర్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని సివిల్ సప్లయ్ హమాలీల సంఘం మండలాధ్యక్షుడు పోచ్చన్న అన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీల సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోవ గోవింద్, హమాలీ కార్మికులు అన్నెల రాజన్న, అన్నెల రాజలింగు, అడెల్లు, లక్ష్మీకాంత్, దేవీదాస్, వెంకటి, నడిపెన్న, తొగరి అడెల్లు, సివిల్ సప్లయ్ గోదాం సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు అసౌకర్యాలకు గురికాకుండా చూడాలి



దస్తురాబాద్ : విద్యార్థులతో మాట్లాడుతున్న నిర్మల్ డీఈవో రామారావు

దస్తురాబాద్, జనవరి 1 : విద్యార్థులు అసౌకర్యాలకు గురి కాకుండా చూడాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంట గది, స్టోరూం, తదితర వాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడారు. సమస్యలు, సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కడెం ఎంఈవో షేక్ హుస్సేన్, హెచ్‌ఎం కోట వేణు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెంబి, జనవరి 1: మండపల్లి కేజీబీవీని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తనిఖీ చేశారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంఈవో రాంచందర్ ఉన్నారు.

## వేదశిల వద్ద ముళ్ల పొదల తొలగింపు

బాసర, జనవరి 1 : బాసర అమ్మవారి క్షేత్రంలో బస్టాండ్‌వద్ద గల వేద శిల చుట్టు ఉన్న ముళ్ల పొదలను బుధవారం తొలగించారు. ఎంతో ప్రచుర్యం కల వేదశిల వద్ద చెత్తాచెదారం, ముళ్ల పొదలు ఉండడం మూలంగా భక్తులు వెళ్లడం లేదు. దీంతో బాసర మండల కేంద్రానికి చెందిన పారిశ్రామిక వేత్త లక్ష్మీకాంత్ పాంఫట్ వారు స్పందించి భైంసా ఆర్టీసీ జనరల్ మేనేజర్ సహాయంతో తన సొంత ఖర్చులతో పారిశ్రామిఖ వేత్త లక్ష్మీకాంత్ వేదశీల పరిసరాల్లోని ముళ్లపొదలను తొలగించి పరిశుభ్రం చేయించారు.

## నేడు నాగోబా జాతర ఏర్పాట్లపై సమావేశం

ఇంద్రవెల్లి, జనవరి 1: కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లపై సమావేశం గురువారం నాగోబా దర్బార్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో రాజమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు నాగోబా జాతర ఏర్పాట్లపై ఐటీడీఏ శాఖలకు చెందిన అధికారులతో పాటు దేవాదాయ, పోలీస్, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

భైంసాటౌన్, జనవరి 1: కుంటాల మండలం పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన గంగామణికి సీఎం సహాయనిధి నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. బుధవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దేగాంలోని ఆయన నివాసంలో లబ్ధిదారురాలికి చెక్కు అందజేశారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ఖానాపూర్ రూరల్, జనవరి 1: ఖానాపూర్ మండలం బాదనకుర్తి గ్రామ శివారులోని గోదావరి నదిలో మంగళవారం రాత్రి విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందింది. బాధితుడు శనిగారపు బీమరాజు తెలిపిన వివరాల ప్రకారం రోజులాగే మేతకు గేదె నీరు తాగడానికి నదిలోకి వెళ్లింది. నదిలో పంట సాగు కొరకు విద్యుత్ మోటారు అమర్చడంతో విద్యుత్ నీటి మోటరు తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి

ఎదులాపురం, జనవరి 1 : మౌళిక సదుపాయాల కల్పన ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు సూర్యకుమార్, కార్యదర్శులు స్వామి, ఇస్తారి, విలాస్, శివన్న, గణేశ్, గౌస్ మొహియుద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షను విరమించిన కొత్తూర్ శంకర్



కుభీర్: శంకర్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేస్తున్న నాయకులు

కుభీర్, జనవరి 1: రిజర్వేషన్ ప్రాతిపదికన ఎస్సీలకు కేటాయించిన కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నామినేటెడ్ పదవిని ప్రభుత్వం భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుందని మండలంలోని పార్డి(బీ) గ్రామానికి చెందిన దళిత నాయకుడు కొత్తూర్ శంకర్ కుభీర్ మార్కెట్ యార్డు ఎదుట డిసెంబర్ 30వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. బుధవారంతో మూడో రోజుకు చేరిన దీక్షలో శంకర్ ఆరోగ్యంలో మార్పులు రావడం, ఎనర్జీ లెవెల్స్ పడిపోవడంతో ఆయా పార్టీల మండల నాయకులు, దళితులు, సామాజిక కార్యకర్తలు, యువకులు ఆయనకు నచ్చచెప్పారు. చీకటిలో విపరీతమైన దోమల నడుమ ఇక్కడ ఉండడం శ్రేయస్కారం కాదని డాక్టర్ సంతోష్ ఆయనను పరీక్షించి దీక్షను విరమించాలని చెప్పడంతో మాజీ మండలాధ్యక్షుడు విఠల్, మాజీ జడ్పీటీసీ మోహన్, కాంగ్రెస్ నాయకులు శంకర్ చంద్రే, పార్టీ మండలాధ్యక్షుడు బషీర్, పల్సి మాజీ సర్పంచ్ కొట్టె హన్మాండ్లు, జేడీరాం, సంతోష్ కలిసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేద్దామని నచ్చజెప్పి ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

## భైంసాలో బంద్ ప్రశాంతం



భైంసా పట్టణంలో మూసి ఉన్న దుకాణాలు

భైంసా, జనవరి, 1 : నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో వరుస చోరీ ఘటనలను నిరసిస్తూ హిందూ ఆలయాల పరిరక్షణ సమితి పిలుపు మేరకు బుధవారం భైంసాలో వ్యాపార దుకాణా సముదాయాల బంద్ ప్రశాంతంగా జరిగింది. హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి నాయకులు మాట్లాడుతూ మంగళవారం నాగదేవత ఆలయంతో పాటు ఇటీవల భైంసాలో నర్సింహ స్వామి ఆలయం, తదితర ఆలయాల్లో చోరీలు, తదితర ఘటనలకు పాల్పడిన దుండగులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎస్పీ అవినాష్ కుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతిపత్రాలు అందజేశారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏఎస్పీ, పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

## ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

నిర్మల్ అర్బన్, జనవరి 1: ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి అన్నారు. బుధవారం బస్‌డిపోలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా డ్రైవర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించి బస్సులను నడపాలని ఆర్టీసీపై ప్రయాణికులకు నమ్మకం మరింత పెంచేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన సైనికుడికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద, జనవరి 1: లక్ష్మణచాంద మండలం పారుపెల్లి గ్రామానికి చెందిన వంగరాజు గౌడ్ దేశ రక్షణకు ఆర్మీలో 28 సంవత్సరాలు సేవలందించి ఉద్యోగ విరమణ పొంది బుధవారం స్వగ్రామానికి రాగా పొట్టపల్లి(బీ) నుంచి పారుపల్లి గ్రామంలోని ఇంటి వరకు గ్రామస్తులు పూలతో ఘనంగా స్వాగతం పలికి ర్యాలీ తీశారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూకల రాజేందర్, మాజీ ఎంపీటీసీ చంద్రమోహన్‌రెడ్డి, కంకళ్ల గోవర్ధన్, కళ్యాణి, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నార్నూర్, జనవరి 1 : క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావ్ అన్నారు. బుధవారం ఖైరదాట్వ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో మడావి నారంజిపటేల్, రాయిసెంటర్ సార్‌మేడి మడావి తుకారాం, తుడుందెబ్బ మండల కార్యనిర్వాహకుడు సాగర్, గాదిగూడ మండలాధ్యక్షుడు సంతోష్, విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి ఆత్రం జాలీంషావ్ జైవంత్‌రావ్, రాము, గోవింద్‌రావ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## యువకులు రక్తదానం చేయాలి

ఇంద్రవెల్లి, జనవరి 1: పిట్టబొంగురం గ్రామంలో అమరవీరుల స్ఫూర్తితో నవజ్యోతి యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో మండలంలోని యువత పాల్గొని రక్తదానం చేయాలని కేస్లాపూర్ రాయిసెంటర్ గిత్తేదార్ బారిక్‌రావ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. యువతకు రక్తదాన ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రక్తదానం చేసే యువతల పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం శేఖర్‌బాబు, నవజ్యోతి యూత్ సభ్యులు పాల్గొన్నారు.